క్లుప్తంగా

ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం



పెదపెంకిలో కోలాటం ఆడుతున్న చిన్నారులు

బలిజిపేట: మండలంలోని పెదపెంకి గ్రామంలో పెద్దవీధి నందెన్న నిమజ్జనోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన చిన్నారుల కోలాటం ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. అరసాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన కోలాటం గ్రామస్తులను అలరించింది. పాఠశాల పీఈటీ ఎం.గణపతి ఇచ్చిన తర్ఫీదుతో చిన్నారులు కోలాటాన్ని ప్రదర్శించారని నిర్వాహకులు తెలిపారు. చిన్నారులకు గ్రామస్తులు రూ.3వేలు బహుమతిగా అందించారు. నిమజ్జనం సందర్భంగా గుల్లిపల్లి వారి కుటుంబీకులు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో రాక పోకలకు ఇబ్బందులు



మార్కెట్‌లో బురదనీటిలో గొయ్యి

సీతానగరం: మండల కేంద్రం సీతానగరంలోని మార్కెట్‌లో బీటీ రోడ్డు గోతులు, బురదమయం కావడంతో వాహన చోదకులు రాకపోకలకు అవస్థలు పడాల్సి వస్తోంది. నిత్యం వేలాది మంది పాదచారులు, వాహన చోదకులు, బస్సులు లారీలు తిరుగాడుతుంటాయి. ఇళ్లలోని వాడుక నీరు రోడ్డుపైకి రావడం, వర్షం నీరు బయటకు మళ్లించేందుకు సౌకర్యం లేక పోవడంతో రోజుల తరబడి నీరు నిల్వ ఉండిపోవడం వల్ల రోడ్డు బురుదమయమై వాహనాలు, పాద చారులు అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై నీరు మళ్లించడానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డుకు ఇరువైపులా కాలువల నిర్మాణం చేపడతామని ఇచ్చిన హామీ అమలు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాహన చోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా రోడ్డుపై గోతులు పూడ్చి, అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతున్నారు.

మున్సిపల్ కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పాలకొండ: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకులు డి.రమణారావు డిమాండ్ చేశారు. స్థానిక నగరపంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం కార్మికులు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలకు నిధులు కేటాయించి బలోపేతం చేయాలని, కార్మికులకు మౌలిక వసతులు కల్పించాలని, పనిభారం తగ్గించాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉమ్మడి కార్యాచరణ ద్వారా పోరాటాలకు సిద్ధం కావాలని యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ నెలలో సంతకాల సేకరణ, దశల వారిగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. యూనియన్ నాయకులు వెంకటరావు, వేణు, సురేష్, సంజీవి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ అమ్మన్నరావు

సీతంపేట: ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్‌ఐ వై.అమ్మన్నరావు అన్నారు. కిట్టాలపాడు జంక్షన్ వద్ద యువతకు రహదారి భద్రత, సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై ఆదివారం అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిర్లక్ష్యం తగదు..

పాలకొండ రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన చోదకులు సహకరించాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్సై కె.ప్రయోగమూర్తి సూచించారు. పట్టణ పరిధిలో ఆటో యూనియన్స్ సభ్యులు, డ్రైవర్లతో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్సై మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించవద్దన్నారు. ముఖ్యంగా పిల్లలను పాఠశాలలకు తీసుకువెళ్లే ఆటోల డ్రైవర్లు జాగ్రత్తగా డ్రైవ్ చేయాలని సూచించారు. సరైన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినా, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.



జియ్యమ్మవలస మండలం సీమనాయుడువలస జంక్షన్ వద్ద రహదారి



సీమనాయుడువలస ఎస్‌బీఐ ఖాతాదారుల సేవా కేంద్ర వద్ద రహదారి



పార్వతీపురం పట్టణ శివారులో గల పార్వతీపురం - పాలకొండ రహదారి

చెరువులు కాదు రోడ్లే..!

- వర్షానికి జలమయమైన రహదారులు
- ప్రమాదకర ప్రయాణంతో వాహన చోదకుల ఆందోళన

పార్వతీపురంటౌన్: ఈ ఫొటోల్లో కనిపిస్తున్నవి చెరువులు కాదు. చెరువులను తలపిస్తున్న పార్వతీపురం మన్యం జిల్లాలోని రహదారులు. జిల్లాలో శనివారం రాత్రి కురిసిన చిన్నపాటి వర్షానికి రహదారి గుంతల్లో నీరు చేరడంతో అవి చెరువులను తలపిస్తున్నాయి.

జిల్లాలో 201.42 కొలోమీటర్ల పొడవున రహదారి మరమ్మతు పనులు చేపట్టడానికి రూ.11.75 కోట్లు మంజూరు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. నిధుల మంజూరు ప్రకటనలకే పరిమితం కావడంతో ప్రమాదకర ప్రయాణంతో వాహన చోదకులు ఆందోళనకు గురవుతున్నారు.



పార్వతీపురం మండలంలోని అడ్డాపుశీల గ్రామం వద్ద పార్వతీపురం-వీరఘట్టం రహదారి



పెదమేరంగి కూడలి వద్ద రోడ్డు



పెదమేరంగి-తోటపల్లి రహదారి

మాదక ద్రవ్య రహిత సమాజస్థాపనకు సహకరించాలి



లచ్చయ్యపేటలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం:

మాదకద్రవ్య రహిత సమాజస్థాపనకు, రోడ్డుప్రమాదాలు, సైబర్ నేరాల నివారణకు అందరూ సహకరించాలని ఎస్సై ఎం. రాజేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని లచ్చయ్యపేటలో గ్రామస్తులు, వాహనయజమానులు, ఆటోడ్రైవర్లతో ఆదివారం సాయంత్రం ఆయన మాదక ద్రవ్యాల వినియోగంతో వచ్చిన అనర్థాలు, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న విధానాలు, సైబర్ నేరాలు జరుగుతున్న సంఘటనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజేష్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, గంజాయి, గుట్కా, గుడుంబా, తంబాకు, ఖైనీ తదితర నిషేధిత మత్తు పదార్థాలు విక్రయించినా ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని ప్రమాదాలు నివారించడానికి ప్రజలు సహకరించాలని కోరారు. ద్విచక్రవాహనాలు నడిపే వారంతా విధిగా హెల్మెట్‌లు ధరించాలని, రోడ్డుపక్కనే పోలీసు వారు అమర్చిన హెచ్చరిక బోర్డులను పరిశీలించాలని హితవు పలికారు.

మోటార్ సైకిల్ నడపడానికి అనుభవం లేకుండా డ్రైవింగ్ చేయడంతోను, చిన్న పిల్లలతో డ్రైవింగ్ చేయించడం, మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అలాగే మండల కేంద్రంలో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే తక్షణమే పోలీసు వారికి తెలియజేయాలని కోరారు. సైబర్ నేరాల నివారణకు ప్రజలు అవగాహన కల్పించు కోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ కృష్ణ, జెడ్పీటీసీ బాబ్జీ, ఎంపీటీసీ ఎ.సింహాచలం, వి అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ వి.గుంపస్వామి, పంచాయతీ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు సీసీ రోడ్డు నిర్మాణం

- భూమిపూజ చేసిన సర్పంచ్



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ తుమ్మనపల్లి సత్యవతి

సీతానగరం: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో స్వర్గధామాని (శ్మశాన వాటిక)కి సీసీ రోడ్డు నిర్మాణం నిమిత్తం గ్రామ సర్పంచ్ టి.సత్యవతి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సదర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం రూ.5 లక్షలు నిదులు మంజూరు చేయడం వల్ల గ్రామపెద్దల సూచనల మేరకు సామాజిక అభివృద్ధి పనులకు నిధులు కేటాయించినట్లు తెలియజేశారు. ఈ నేపథ్యంలో గ్రామం నుంచి స్వర్గధామానికి రహదారి సౌకర్యం లేక పోవడంతో ఈ నిధులతో ప్రజల కోరిక మేరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ టి.పార్వతి, మాజీ సర్పంచ్ వెంకటరమణ, శ్రీనివాసరావు, సింహాచలం, మాజీ ఉపసర్పంచ్ పెరుమాళి గడ్డియ్య పి.బాల, ఏఎన్ఎం రమాదేవి, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈదురుగాలికి నేలమట్టమైన పంటలు



చినభోగిలిలో నేమట్టమైన వరిచేను

- ఆందోళనలో రైతులు

సీతానగరం: మండలంలో శనివారం రాత్రి వీచిన ఈదురుగాలితో పాటు కురిసిన వర్షానికి పొలాల్లో ఏపుగా పెరిగిన వరి పంట నేలమట్టం కావడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈదురు గాలి కారణంగా చినభోగిలి, అనంతరాయుడు పేట, రంగంపేట గ్రామాల్లో వరిచేను పంటపక్వదశకు వచ్చిన సమయంలో నేలమట్టమైనందున జరిగిన పంట నష్టానికి వ్యవసాయ అధికారులు అంచనా వేసి ఆర్థిక సహాయ అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఏఓ ఎస్.అవినాష్ వద్ద ప్రస్తావించగా ఇటీవల కురిసిన వర్షాల కారణంగా చినభోగిలి, పెదభోగిలి, లక్ష్మీపురం, వెంకటాపురం, పూను బుచ్చింపేట గ్రామాల్లో రైతులనుంచి పంటనష్ట పరిహారం వివరాలు సేకరించినట్లు తెలిపారు.

వచ్చే ఏడాది శ్యామలాంబ పండగ



సమావేశంలో పాల్గొన్న పెద్దలు

సాలూరు: పట్టణ ప్రజల దేవత శ్రీ శ్యామలాంబ అమ్మవారి పండుగ తేదిలు ఖరారయ్యాయి. వచ్చే ఏడాది మే నెలలో పండగ నిర్వహించనున్నట్లు పెద్దలు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని శ్యామలాంబ ఆలయం వద్ద ఆలయ అనువంశిక ధర్మకర్త విక్రమచంద్రసన్యాసిరాజు,పెద్దలు సమావేశమయ్యారు.వచ్చే ఏడాది మే 18న ఉయ్యాల కంబాల, 19న తోలేళ్లు, 20న సిరిమాను సంబరాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. సమావేశంలో స్త్రీశిశు,గిరిజనసంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, మున్సిపల్‌చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భంజ్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు.

కాగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఈ పండగ జరగాల్సి ఉండగా, కోవిడ్, ఆలయ పూజారి ఇంటిలో సమస్యల కారణంగా పెద్దలు పండగను వాయిదావేశారు. ఎట్టకేలకు పండుగ తేదీలు ఖరారు కావడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గంగాడ ఇత్తడి వస్తువులకు గుర్తింపు

- రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక



శివపార్వతుల విగ్రహాలు



తయారైన దేవుని ప్రతిమలు



చిన్నచిన్న వస్తువులు

బలిజిపేట: గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం హయాంలో అందించిన ఆర్థిక సహకారంతో వ్యాపారాభివృద్ధి చేసుకుని జీవనోపాధి మెరుగుపరుచుకుని ఆర్థికంగా ఎదుగుతున్న గంగాడ ఇత్తడి వస్తువులు, పంచలోహ విగ్రహాల తయారీదారుల ఉత్పత్తులు 21వ తేదీన విజయవాడలో జరిగే డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శనకు ఎంపిక కావడం విశేషం. బలిజిపేట మండలంలోని గంగాడ గ్రామంలో జిల్లా చిన్నతరహా పరిశ్రమల శాఖ సౌజన్యంతో పంచలోహ, ఇత్తడి వస్తువులు తయారు చేస్తున్న 32కుటుంబాలకు రూ.70లక్షల చెక్కులను జనవరి, 7, 2022వ సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యే జోగారావు పంపిణీ చేశారు. గ్రామంలోని 32కుటుంబాలకు 35శాతం రాయితీతో రూ.70లక్షల చెక్కును ఆయన అందించగా ఆ సొమ్ముతో జీవన ప్రమాణాలు పెంచుకునేందుకు డ్వాక్రా గ్రూపులకు చెందిన మహిళలు శాయశక్తులా కష్టపడి ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఇత్తడి వస్తువులు, పంచలోహ ప్రతిమలు తయారుచేసి వాటిని విక్రయించి అప్పు తీర్చుకుంటూ జీవనోపాధిని మెరుగుపరుచుకుంటున్నారు. రాష్ట్రస్థాయి ఉత్పత్తుల ప్రదర్శనకు గంగాడ వస్తువులు ఎంపిక కావడంతో వారంతా సంతృప్తి చెందుతున్నారు. రానున్న రోజుల్లో వీటికి మరింత గిరాకీ పెరిగి వ్యాపారం అభివృద్ధి జరిగేందుకు ప్రభుత్వం సహకరించాలని కోరుతున్నారు.



గత ప్రభుత్వంలో ఇత్తడివస్తువుల తయారీ కుటుంబాలకు అందించిన చెక్కు(ఫైల్)

సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి



మా కులవృత్తిలో ఉన్న నిరుద్యోగ యువకులు వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునేందుకు అవసరమైన సబ్సిడీ రుణాలను మంజూరుచేయాలి. మంచి, మంచి వస్తువులు తయారుచేసి వాటిని విక్రయించేందుకు అవసరమైన ఆర్థిక సాయం ప్రభుత్వం నుంచి అందిస్తే మా జీవితాలను మరింత మెరుగుపరుచుకుంటాం.

– నాగరాజు, ఇత్తడి వస్తువుల తయారీదారు, గంగాడ

ట్రాన్స్ జెండర్ల జీవనోపాధికి చేయూత

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ట్రాన్స్ జెండర్ల జీవనోపాధికి తమవంతు సాయం అందిస్తున్నట్లు మిస్బా వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ షిరిన్ ఖాన్ తెలిపారు. ఈమేరకు కురుపాం మండల కేంద్రంలో పలువురు ట్రాన్స్ జెండర్లకు జీవనోపాధి కల్పించేందుకు యస్ సొసైటీ ఆధ్వర్యంలో విశాఖపట్నంకు చెందిన మిస్బా వెల్ఫేర్ సొసైటీ, మాజీ నేవీ ఉద్యోగులు సంయుక్త సహకారంతో కొబ్బరి కాయలు, పూజా సామాగ్రి అమ్మకం చేసే దుకాణంతో పాటు కిరాణా షాప్, హోటల్‌ను (3 యూనిట్లను) ఆదివారం ఏర్పాటు చేయించారు. అందుకోసం అవసరమైన వస్తువులు, నగదును వితరణగా అందించారు. ఈ సందర్భంగా షిరిన్ ఖాన్ మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్లు ఆర్థికంగా అభివృద్ధి చెంది సమాజంలో గౌరవంగా బతకాలనే ఉద్దేశంతో సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. మాజీ నేవీ ఉద్యోగి నగేష్ మాట్లాడుతూ తమ సహకారాన్ని సద్వినియోగించుకుని, మరింత మందికి సాయం అందించేందుకు స్ఫూర్తిని ఇవ్వాలని కోరారు. అనంతరం ట్రాన్స్ జెండర్ గ్రూపు సభ్యులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మిస్బా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు అబ్దుల్లా, నేవీ ఉద్యోగులు శిరాజుద్దీన్, ప్రతాప్, తిరుపతిరావు, యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, ట్రాన్స్ జెండర్ల గ్రూప్ అధ్యక్షులు గీతారాణి తదితరులు ఉన్నారు.

పుష్పశ్రీవాణికి అభినందనల వెల్లువ



పుష్పశ్రీవాణికి అభినందనలు తెలుపుతున్న గుమ్మలక్ష్మీపురం మండల నాయకులు

జియ్యమ్మవలస: మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణికి గుమ్మలక్ష్మీపురం మండల నాయకులు అభినందనలు తెలియజేశారు. పది సంవత్సరాలుగా కుల వివాదంలో నలుగుతున్న ఆమె ఎస్టీ కులానికి చెందినట్లు హైకోర్టు తీర్పు ఇవ్వడంతో కురుపాం నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం చినమేరంగిలోని ఆమె నివాసానికి వెళ్లి అభినందనలు తెలిపారు. ఆమెను కలిసిన వారిలో గుమ్మలక్ష్మీపురం మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, జెడ్పీటీసీ బి.సుజాత, వైస్ ఎంపీపీలు అన్నాజీరావు, రంగారావు, నీలకంఠాపురం సర్పంచ్ ఎ.మన్మథరావు, కురుపాం సర్పంచ్ జి.సుజాత, ఎంపీటీసీ జి.విద్యారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు. కాగా, పుష్పశ్రీవాణి ఎస్టీ కులానికి చెందినవారు కాదని ఆరోపిస్తూ 2019లో నిమ్మక జయరాజు, నిమ్మక సింహాచలం కోర్టులో కేసు వేశారు. దీనిపై విచారించిన హైకోర్టు ఆమెకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది.

అదనపు వైద్యాధికారిని నియమించరూ..

సీతంపేట: దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెండో మెడికల్ ఆఫీసర్ లేకపోవడంతో ఒక డాక్టరుతోనే నెట్టుకొస్తున్నారు. ఈ ఆరోగ్య కేంద్రం పరిధిలో మలేరియాతో పాటు టైఫాయిడ్, వైరల్ జ్వరాలు ఇటీవల అధికంగా నమోదవుతున్నాయి. ఒకే డాక్టర్ అందుబాటులో ఉండటంతో గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణ, ఆస్పత్రిలో ఓపీ సేవలు అందించడం కష్టమవుతోంది. వైద్య సేవలు సరిగా అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

ఎన్నికల హామీలు ఎప్పుడు అమలుచేస్తారు?



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

పాలకొండ రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ఆలస్యం చేస్తోందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.సుబ్బరావమ్మ అన్నారు. నాలుగు నెలలైనా హామీల అమలుపై సరైన స్పష్టత లేదని, సూపర్ సిక్స్ పథకాలు ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాలకొండలో ఆదివారం జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యవ్యతిరేక విధానాలను తూర్పారా పట్టారు. అధికారం కోసం కూటమి కట్టిన పార్టీలు నేడు కార్మిక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ కార్పొరేట్ వర్గాలకు కొమ్ము కాస్తున్నాయన్నారు. ప్రజలపై ఆర్థిక భారం మోపి ఎంతోకొంత సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యత్నిస్తున్న తీరును జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు ఎండగట్టారు. తీరు మార్చుకోకుంటే ఐక్య పోరాటాలను ఉధృతం చేస్తామని నిర్ణయించారు. సమావేశంలో కోశాధికారి జి.వెంకటరమణ, జిల్లా నాయకులు అప్పలస్వామి, కాంతారావు, ఇదిర, జ్యోతి, రామలక్ష్మి తదితరులున్నారు.